జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
ఆదివారం 28-06-2026
సంపుటి 1 సంచిక 215
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195



విలేకరులు కావలెను
నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ · ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ · క్రైమ్ రిపోర్టర్లు
7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)


# తెలంగాణకు రెండు బెర్తులా?

## కేంద్ర కేబినెట్ విస్తరణలో డీకే అరుణ, ఈటల పేర్లు

### రాజకీయ వర్గాల్లో చర్చ

### సామాజిక సమీకరణాలకు బీజేపీ ప్రాధాన్యం ఇవ్వొచ్చనే ఊహాగానాలు



**దశ, హైదరాబాద్ :** కేంద్ర మంత్రివర్గ విస్తరణపై జాతీయ రాజకీయాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. త్వరలో కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందనే ప్రచారం నేపథ్యంలో తెలంగాణ నుంచి ఇద్దరు బీజేపీ ఎంపీలకు కేంద్ర మంత్రివర్గంలో అవకాశం లభించవచ్చన్న ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో బీజేపీ సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇచ్చే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహబూబ్‌నగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్లు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి. ఈటల రాజేందర్ గతంలో తెలంగాణ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన అనుభవంతో పాటు బీసీ (ముదిరాజ్) సామాజిక వర్గంలో ప్రభావం కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయనకు కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పిస్తే తెలంగాణలో పార్టీ విస్తరణకు ఉపయోగపడుతుందనే అభిప్రాయం కొందరు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మరోవైపు డీకే అరుణ ప్రస్తుతం మహబూబ్‌నగర్ నుంచి లోక్‌సభ సభ్యురాలిగా ప్రాతినిధ్యం వహిస్తుండటంతో పాటు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమెకు అవకాశం కల్పించడం ద్వారా రాష్ట్రంలో రెడ్డి సామాజిక వర్గానికి పార్టీ మరింత చేరువయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి కేంద్ర మంత్రివర్గంలో కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాజా విస్తరణలో రాష్ట్రానికి అదనపు ప్రాతినిధ్యం లభిస్తుందా లేదా అనేది అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే స్పష్టత రానుంది. అయితే కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు కేబినెట్ విస్తరణపై అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో తెలంగాణ నుంచి ఎవరికీ అవకాశం దక్కుతుందన్న అంశంపై జరుగుతున్న చర్చలు ప్రస్తుతం రాజకీయ వర్గాల అంచనాలు, ఊహాగానాలకే పరిమితమయ్యాయి.



## దర్శకుడు, నటుడు భాగ్యరాజ్ మృతి

### భాగ్యరాజ్ హఠాన్మరణంతో దిగ్భ్రాంతిలో సినీ లోకం

**దశ, చెన్నై:** సినీ ఇండస్ట్రీలో విషాదం నెలకొంది. తమిళ దర్శకుడు నటుడు భాగ్యరాజ్ (73) కన్నుమూసారు. గుండెపోటు కారణంగా అయన మరణించారు. చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అయన నటుడిగా, దర్శకుడిగా, రైటర్ గా, స్వరకర్తగా, నిర్మాతగా పలు సినిమాలు అందించారు. తమిళ చిత్ర పరిశ్రమలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగాంచిన భాగ్యరాజ్ ను ఇండియన్ సినిమాలో

..మిగతా 4వ పేజీలో →

## లండన్లో తెలంగాణ విద్యార్థి అనుమానాస్పద మృతి 4లో

### కామారెడ్డి జిల్లా తలమడ్లలో విషాదఛాయలు



## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### వికాస్ రాజ్

**దశ, నల్గొండ:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం నల్లగొండ జిల్లా పర్యటన ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని రోడ్లు, భవనాలు, రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాల మైదానం, కనగల్‌లో సీఎం శంకుస్థాపన చేయనున్న రూ.13,006 కోట్ల హ్యాం రోడ్ల ప్రాజెక్టు పైలాన్ ప్రాంతాలను పరిశీలించారు. ఎన్‌జీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను క్షుణ్నంగా పరిశీలించిన వికాస్ రాజ్, సభా వేదిక, ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న టెంట్లు, జర్మన్ హ్యాంగర్లు, లైటింగ్, సౌండ్ సిస్టమ్, ఎల్‌ఈడీ స్క్రీన్లు, బ్యారికేడింగ్ వంటి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఏర్పాటూ పకడ్బందీగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి నల్లగొండ జిల్లాలో అడుగుపెట్టినప్పటి నుంచి తిరుగు ప్రయాణం వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని

..మిగతా 4వ పేజీలో →



## కోడిగుడ్డు @10?

### సామాన్యుడికి మరో షాక్

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో కోడిగుడ్డు ధరలు రోజురోజుకూ పెరుగుతూ సామాన్యుడి వంటగది బడ్జెట్‌పై అదనపు భారంగా మారుతున్నాయి. గత మూడు నెలలుగా కొనసాగుతున్న ధరల పెరుగుదలతో ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో ఒక్కో కోడిగుడ్డు రూ.8 వరకు విక్రయిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలోనే ఒక్కో గుడ్డు ధర రూ.10కు చేరే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) గణాంకాల ప్రకారం, హైదరాబాద్‌లో జూన్ 20 నుంచి 26 వరకు హోల్‌సేల్ మార్కెట్లో ఒక్కో గుడ్డు ధర రూ.6.35గా నమోదైంది. ఈ నెల ప్రారంభంలో రూ.5.55గా ఉన్న ధర క్రమంగా పెరుగుతూ రావడంతో ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో ప్రాంతాన్ని బట్టి రూ.6.80 నుంచి రూ.8 వరకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది తీవ్ర వేసవి ప్రభావంతో రాష్ట్రంలోని పౌల్ట్రీ ఫారాల్లో

..మిగతా 4వ పేజీలో →

## మణుగూరు

# ఇసుక రీచ్‌లపై దుష్ప్రచారం?

- గిరిజనుల ఉపాధికి అండగా మీడియా సహకారం: శ్రీకర్
- చట్టబద్ధ అనుమతులతోనే నిర్వహణ పారదర్శక విధానంలో ఇసుక రవాణా
- వాస్తవాలు తెలుసుకుని వార్తలు రాయాలని విజ్ఞప్తి
- గిరిజన సొసైటీలు, రైజింగ్ కాంట్రాక్టర్ అడబాల శ్రీకర్





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సబ్‌డివిజన్ పరిధిలో కొనసాగుతున్న ఇసుక రీచ్‌ల నిర్వహణపై ఇటీవల వెలువడుతున్న కొన్ని కథనాలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించడం లేదని గిరిజన సొసైటీలు, రైజింగ్ కాంట్రాక్టర్ శ్రీకర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నూతన ఇసుక విధానానికి అనుగుణంగా, మైనింగ్ శాఖతో పాటు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు పొందిన అనంతరమే రీచ్‌ల నిర్వహణ కొనసాగుతోందని వారు తెలిపారు. ప్రస్తుతం ఇసుక రవాణా మొత్తం ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతోందని, ప్రతి వాహనానికి

..మిగతా 4వ పేజీలో →




## జ్యువెలరీ షోరూమ్‌లో రౌడీషీటర్ వీరంగం

### కత్తితో బెదిరించి లక్షల రూపాయలు డిమాండ్.. ఇద్దరు అరెస్ట్

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పరిధిలో ఓ జ్యువెలరీ షోరూమ్‌లో రౌడీషీటర్ వీరంగం సృష్టించిన ఘటన కలకలం రేపింది. మద్యం మత్తులో షోరూమ్‌లోకి ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులు మేనేజర్‌ను కత్తితో బెదిరించి లక్షల రూపాయలు డిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. రోడ్ నంబర్-10లో ఉన్న శ్రీ సాయి జగదాంబ పెర్ల్స్ అండ్ జ్యువెలర్స్ షోరూమ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితులు అలీమ్, యూనస్ మద్యం మత్తులో వచ్చి షోరూమ్ మేనేజర్ పంకజ్ బండ్గర్‌ను బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మేనేజర్‌ను కత్తితో బెదిరిస్తూ లక్షల రూపాయలు ఇవ్వాలని

..మిగతా 4వ పేజీలో →

# మలుపులు తిరుగుతున్న మెట్రో


### ఫేజ్-1 టేకోవర్‌పై ఉత్కంఠ.. రంగంలోకి ఎస్‌బీఐ క్యాప్స్

### వాల్యుయేషన్ నివేదికతోనే ప్రాజెక్టు భవితవ్యం తేలే అవకాశం

**దశ, హైదరాబాద్ :** హైదరాబాద్ వంటి అంతర్జాతీయ మహానగరానికి ప్రజా రవాణాలో కీలకమైన మెట్రో రైలు ప్రాజెక్టు ప్రస్తుతం కీలక దశకు చేరుకుంది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మితమైన హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1 నిర్వహణ నుంచి నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ తప్పుకోవాలని నిర్ణయించడంతో ప్రాజెక్టు భవితవ్యంపై కొత్త చర్చ మొదలైంది. టేకోవర్ ప్రక్రియ కొనసాగుతుండగానే దేశంలోని ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ ఎస్‌బీఐ క్యాప్స్ రంగంలోకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల ఢిల్లీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన ఉన్నతస్థాయి సమావేశాల అనంతరం మెట్రో ప్రాజెక్టు ఆర్థిక విలువ (వాల్యుయేషన్) అంచనా బాధ్యతలను ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించారు. ఎల్‌అండ్‌టీ చేసిన పెట్టుబడులు, తీసుకున్న రుణాలు, ప్రాజెక్టుకు సంబంధించిన ఆస్తులు, రియల్ ఎస్టేట్ ద్వారా వచ్చే ఆదాయం, ప్రస్తుతం ప్రాజెక్టు మార్కెట్ విలువ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి సంస్థ నివేదిక సమర్పించనుంది. ఈ నివేదిక ఆధారంగానే తెలంగాణ ప్రభుత్వం ఎల్‌అండ్‌టీకి చెల్లించాల్సిన పరిహారం ఎంత, టేకోవర్ ప్రక్రియ ఎలా సాగాలన్నదానిపై స్పష్టత రానుంది. అయితే ఈ ప్రక్రియ త్వరగా పూర్తవుతుందా, లేక వాల్యుయేషన్ అంశాల కారణంగా మరింత ఆలస్యమవుతుందా అనే సందిగ్ధత నెలకొంది. రోజుకు సుమారు ఐదు

..మిగతా 4వ పేజీలో →





## ఫ్లాట్ చూసేందుకు వెళ్లి.. ప్రమాదం బారిన..

### లిఫ్ట్ కూలి 8 మందికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

### మీర్పేట్‌లో ఘటన.. సాంకేతిక లోపాలపై పోలీసుల దర్యాప్తు

**దశ, రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లాలోని హైదరాబాద్ కమిషనరేట్ పరిధి మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఫ్లాట్‌ను పరిశీలించేందుకు వెళ్లిన

..మిగతా 4వ పేజీలో →



## గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్ 4లో

### రూ. లక్షల విలువైన 5.849 కిలోల గంజాయి స్వాధీనం

### ఒడిశా నుంచి తీసుకొచ్చి మేడ్చల్‌లో విక్రయించేందుకు యత్నం


# మలుపులు తిరుగుతున్న హైదరాబాద్ మెట్రో



**మొదటి పేజీ తరువాయి**

లక్షల మంది ప్రయాణికులు మెట్రో సేవలను వినియోగిస్తున్నప్పటికీ, ఫేజ్ 1 ప్రాజెక్టు ఆశించిన స్థాయిలో ఆదాయం ఆర్జించలేకపోయింది. కోవిడ్ అనంతర పరిస్థితులు, ఐటీ రంగంలో మారిన పని విధానాలు, ప్రయాణికుల సంఖ్యలో హెచ్చుతగ్గులు ఎల్అండ్టీపై తీవ్ర ఆర్థిక ప్రభావం చూపాయి. ప్రభుత్వం అందించిన రూ.3,000 కోట్ల సాఫ్ట్ లోన్ కూడా సంస్థను పూర్తిగా గట్టెక్కించలేకపోయినట్లు తెలుస్తోంది. దీంతో నిర్మాణ రంగంలోని ప్రధాన వ్యాపారంపైనే దృష్టి సారించాలనే ఉద్దేశంతో మెట్రో ప్రాజెక్టు నుంచి వైదొలగాలని ఎల్అండ్టీ నిర్ణయించినట్లు సమాచారం. ఇక ప్రాజెక్టు టేకోవర్ విషయంలో కేంద్రం, రాష్ట్రం మధ్య విధానపరమైన భేదాభిప్రాయాలు కూడా కొనసాగుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా రాష్ట్ర ఆధీనంలోకి మెట్రోను తీసుకురావాలని భావిస్తుండగా, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఢిల్లీ, బెంగళూరు మెట్రో తరహాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్య (50:50 జాయింట్ వెంచర్) మోడల్ను పరిశీలించాలని సూచిస్తున్నట్లు సమాచారం. ఈ విధానం అమలైతే కేంద్ర నిధులు పొందే అవకాశం ఉన్నప్పటికీ, పూర్తి నియంత్రణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదు. ఫేజ్ 1 టేకోవర్ త్వరగా పూర్తికాకపోతే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన మెట్రో ఫేజ్2 విస్తరణ ప్రణాళికలపై కూడా ప్రభావం పడే అవకాశముంది. శంషాబాద్ విమానాశ్రయం మార్గం, నాగోల్-ఎల్బీనగర్ అనుసంధానం, శేరిలింగంపల్లి కారిడార్ విస్తరణ వంటి ప్రాజెక్టులకు భారీ నిధులు అవసరం. ఇప్పటికే ఉన్న ఆర్థిక బాధ్యతలపై స్పష్టత రాకపోతే జైకా, ఏడీబీ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి కొత్త రుణాల సమీకరణ కూడా క్లిష్టమయ్యే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో భవిష్యత్తు ఎస్బీఐ క్యాప్స్ సమర్పించే ఆర్థిక అంచనా నివేదికపైనే ఆధారపడి ఉంది. ఎల్అండ్టీ ఆశిస్తున్న వాణిజ్య సెటిల్మెంట్, రాష్ట్ర ప్రభుత్వం భరించగలిగే ఆర్థిక పరిమితుల మధ్య సమతుల్యత సాధించే విధంగా ఎలాంటి సిఫార్సులు వస్తాయన్నదే ఇప్పుడు అత్యంత కీలక అంశంగా మారింది.

## లండన్లో తెలంగాణ విద్యార్థి అనుమానాస్పద మృతి



**దశ, హైదరాబాద్:** లండన్లో ఉన్నత చదువుల కోసం వెళ్లి లీసెస్టర్ యూనివర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్న శ్రీనాథ్ రెడ్డి (25) రెండు రోజుల క్రితం స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రాత్రి పడుకున్న శ్రీనాథ్ రెడ్డి తెల్లవారేసరికి విగతజీవిగా పడి ఉన్నట్లు, అక్కడే ఉన్న అతని బంధువులకు స్నేహితులు సమాచారం అందించారు. ఉన్నత చదువుల కోసం అని వెళ్లి, తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని శ్రీనాథ్ రెడ్డి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమైయారు. శ్రీనాథ్ రెడ్డి స్వస్థలం కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామం.

## ములుగు జిల్లాలో విషాదం.. పిడుగుపాటుకు 21 ఆవులు మృతి

**దశ, ములుగు:** పిడుగుపాటుకు గురయిన 21 ఆవులు మృతి చెందాయి. తాడ్వాయి మండలం అంకంపల్లిలో ఘటన చోటు చేసుకుంది. శనివారం భారీ వర్షం కురిసే సమయంలో పొలంలో కట్టి ఉంచిన ఆవులపై పిడుగు పడింది. ఘటనలో > 21 పశువులు అక్కడికక్కడే మరణించడంతో రైతు సమ్మయ్య బోరుమని విలపించాడు. > ఊహించని ఘటనతో దిగ్భ్రాంతిలో అంకంపల్లి గ్రామస్థులు పడిపోయారు. > ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేస్తున్నాడు.

## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**మొదటి పేజీ తరువాయి**

దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. సీఎం ఎన్జీ కళాశాల మైదానానికి చేరుకున్న వెంటనే ప్రజలకు ఇరువైపులా అభివాదం చేసే విధంగా ప్రత్యేక కాంక్రీట్ వేదికను ఏర్పాటు చేయాలని తెలిపారు. ర్యాంప్ లేదా ప్రత్యేక వాహనం ద్వారా సీఎం వేదికకు చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్లకు సూచనలు చేశారు. అనంతరం జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ను పరిశీలించి, భద్రతా ఏర్పాట్ల వివరాలను ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. అలాగే కనగల్ మార్కెట్ యార్డు సమీపంలో ఏర్పాటు చేస్తున్న హ్యాం రోడ్ల శంకుస్థాపన పైలాన్ను పరిశీలించి, పైలాన్కు వినియోగించే రంగులు, సుందరీకరణ పనులపై ఆర్అండ్బీ అధికారులతో చర్చించారు. అక్కడి హెలిప్యాడ్ను కూడా తనిఖీ చేశారు. ఈ పరిశీలనలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్రెడ్డి, ఆర్అండ్బీ, హ్యాం రోడ్ల సీఈ వి. వెంకటేశ్వరరావు, రోడ్లుభవనాల సీఈ రాజేశ్వర్రెడ్డి, ఎస్ఈ శ్రీధర్రెడ్డి, డిప్యూటీ ఇంజినీర్ గణేశ్, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ వాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఇసుక రీచ్లపై దుష్ప్రచారం?

**మొదటి పేజీ తరువాయి**

డిజిటల్ వేబిల్ జారీ చేసిన తర్వాతే రవాణా జరుగుతోందని పేర్కొన్నారు. దీంతో అక్రమాలకు అవకాశం లేకుండా పారదర్శక వ్యవస్థ అమల్లో ఉందని వివరించారు. గిరిజనుల ఉపాధికి కీలక ఆధారం. ఈ రీచ్లు స్థానిక గిరిజన సహకార సంఘాల ఆధ్వర్యంలో కొన సాగుతున్నాయని, వందలాది గిరిజన కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నాయని సొసైటీ ప్రతినిధులు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో నిరాధార ప్రచారాలు గిరిజన కుటుంబాల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### ఒక్కరినే టార్గెట్ చేస్తున్నారనే ఆరోపణ

ఇటీవల వస్తున్న కొన్ని కథనాలు ప్రధానంగా రైజింగ్ కాంట్రాక్టర్ శ్రీకర్, ఆయనతో అనుబంధం ఉన్న గిరిజన సొసైటీలపైనే కేంద్రీకృతమవుతున్నాయని సొసైటీ ప్రతినిధులు ఆరోపించారు. అదే ప్రాంతంలో పనిచేస్తున్న ఇతర రైజింగ్ కాంట్రాక్టర్ల కార్యకలాపాలపై ఇలాంటి స్థాయిలో కథనాలు కనిపించడం లేదని వారు పేర్కొన్నారు. దీంతో, తమను మాత్రమే లక్ష్యంగా చేసుకుని ఉద్దేశపూర్వకంగా ప్రచారం జరుగుతోందనే అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ ప్రచారం వెనుక ఇతర వ్యాపార లేదా పోటీ ప్రయోజనాలు ఉన్నాయనే వాదనలు కూడా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించిన నిజానిజాలను సంబంధిత అధికారులే నిర్ధారించాల్సి ఉంటుందని వారు స్పష్టం చేశారు.

### మీడియాతో 12 ఏళ్ల అనుబంధం

గత 12 సంవత్సరాలుగా స్థానిక మీడియా ప్రతినిధులతో తమకు ఆత్మీయ సంబంధాలు ఉన్నాయని రైజింగ్ కాంట్రాక్టర్ శ్రీకర్ తెలిపారు. మీడియా సహకారం వల్లే గిరిజన సొసైటీల కార్యకలాపాలు ప్రజలకు చేరాయని, మీడియాపై తమకు గౌరవం ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. తప్పులు ఉంటే ఆధారాలతో ప్రశ్నించాలని, కానీ నిర్ధారణ లేకుండా వచ్చే ప్రచారం వేలాది మంది గిరిజనుల ఉపాధిపై ప్రభావం చూపుతుందని అన్నారు. చిన్నచిన్న సమస్యలు ఉంటే పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని, గిరిజనుల జీవనోపాధికి నష్టం కలిగించే విధంగా వ్యవహరించకూడదని విజ్ఞప్తి చేశారు.

### ఆధారాలతో వస్తే సమాధానం ఇవ్వడానికి సిద్ధం

తమపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని, ఎవరికైనా సందేహాలు ఉంటే గిరిజన సొసైటీ సభ్యుల సమక్షంలో చట్టబద్ధమైన ఆధారాలతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని శ్రీకర్ తెలిపారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసి గిరిజనుల ఉపాధిని దెబ్బతీసే ప్రయత్నాలు కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకునే విషయాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

### ప్రెస్, మీడియా సహకారమే గిరిజనులకు బలం

ప్రజలకు వాస్తవాలను చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని, అదే సహకారం భవిష్యత్తులో కూడా గిరిజన సంక్షేమానికి దోహదపడాలని సొసైటీ ప్రతినిధులు ఆకాంక్షించారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి సమతుల్యంగా వార్తలు ప్రచురించడం ప్రజాస్వామ్యానికి, గిరిజనుల అభివృద్ధికి మరింత మేలు చేస్తుందని వారు పేర్కొన్నారు.



## కోడిగుడ్డు @10?

**మొదటి పేజీ తరువాయి**

సుమారు 10 శాతం కోళ్లు మృతి చెందడంతో గుడ్ల ఉత్పత్తి తగ్గింది. అదే సమయంలో కోళ్ల దాణా, మందులు, నిర్వహణ ఖర్చులు పెరగడం కూడా ఉత్పత్తి వ్యయాన్ని పెంచి సరఫరాపై ప్రభావం చూపింది. ప్రస్తుతం ఒక్కో గుడ్డు ఉత్పత్తికి రైతుకు సుమారు రూ.7 వరకు ఖర్చవుతుండగా, ఫామ్గేట్ వద్ద మాత్రం రూ.6 మాత్రమే లభిస్తోందని జాతీయ ఉత్తర తెలంగాణ గుడ్ల సమన్వయ కమిటీ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్రావు తెలిపారు. గతంలో పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఎదురైన నష్టాలను ప్రస్తుతం పెరిగిన ధరలు కొంతమేర భర్తీ చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మరోవైపు చిల్లర వ్యాపారులు హోల్సేల్లో రూ.6.50 చొప్పున కొనుగోలు చేసి, రవాణా, నిర్వహణ ఖర్చులు కలిపి స్వల్ప లాభంతో రూ.7 నుంచి రూ.8 వరకు విక్రయిస్తున్నామని చెబుతున్నారు. రాష్ట్రంలో రోజుకు సుమారు 4 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతుండగా, అందులో సగం వరకు స్థానికంగానే వినియోగమవుతున్నాయి. ధరల పెరుగుదల ప్రభావం ప్రభుత్వ మధ్యాహ్న భోజన పథకం సరఫరాదారులపైనా పడుతోంది. వర్షాకాలంలో ఉత్పత్తి పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, అదే సమయంలో డిమాండ్ కూడా అధికంగా ఉండే అవకాశం ఉండటంతో సమీప భవిష్యత్తులో గుడ్ల ధరలు స్థిరంగా కొనసాగవచ్చు లేదా మరింత పెరిగే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఫ్లాట్ చూసేందుకు వెళ్లి.. ప్రమాదం బారిన..

**మొదటి పేజీ తరువాయి**

ఎనిమిది మంది ప్రయాణిస్తున్న లిఫ్ట్ ఒక్కసారిగా కూలిపోవడంతో వారందరికీ గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. జ్యుడీషియల్ విభాగంలో సీఏఓగా పనిచేసి పదవీ విరమణ పొందిన తిరునగరి నరసింహస్వామి (62) తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఎస్టేట్ ఏజెంట్ దిలీప్ కుమార్ ద్వారా హనుమాన్ నగర్లోని ఓ అపార్ట్మెంట్లో ఫ్లాట్ను పరిశీలించేందుకు వెళ్లారు. అపార్ట్మెంట్లోని 501 నంబర్ ఫ్లాట్ను చూసిన అనంతరం ఎనిమిది మంది ఒకే లిఫ్ట్లో కిందకు వస్తుండగా, నాలుగో అంతస్తు వద్ద లిఫ్ట్ అకస్మాత్తుగా ఆగిపోయి, అనంతరం నేరుగా గ్రౌండ్ ఫ్లోర్ వరకు కూలిపోయింది. దీంతో లిఫ్ట్లో ఉన్న వారందరికీ గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు వెంటనే ఎల్బీనగర్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స కొనసాగుతుండగా, తిరునగరి నరసింహస్వామి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారు.. తిరునగరి నరసింహస్వామి (62), పద్మిని (51), టి. వెంకటేశ్వర్లు (75), టి. నిర్మల (69), పి. గోపాలస్వామి (71), పి. రేణుక (65), టి. పద్మ (68), టి. శోభ (64), సమాచారం అందుకున్న మీర్పేట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. లిఫ్ట్ నిర్వహణలో నిర్లక్ష్యం జరిగిందా, సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమా అనే కోణాల్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

### రూ. లక్షల విలువైన 5.849 కిలోల గంజాయి స్వాధీనం

### ఒడిశా నుంచి తెచ్చి మేడ్చల్లో విక్రయించేందుకు యత్నం

**దశ, మేడ్చల్ :** మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై మేడ్చల్ పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. గంజాయిని అక్రమంగా తరలిస్తూ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 5.849 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, మహారాష్ట్రలోని జల్నా జిల్లాకు చెందిన సచిన్ సంతోష్ జాదవ్ అలియాస్ నితిన్ అలియాస్ ఆకాష్ (24), *రాజేష్ మాధవ్ చౌదరి (22)*లను మేడ్చల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ధ్రువ కళాశాల రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) ఎగ్జిట్ నంబర్-06 సమీపంలో నిర్వహించిన వాహన తనిఖీల సందర్భంగా నిందితులు పోలీసులకు చిక్కారు. వారి వద్ద నుంచి 5.849 కిలోల గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో నిందితులు ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి మేడ్చల్ ప్రాంతంలో అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ కేసులో గంజాయి సరఫరా మూలాలు, అక్రమ రవాణా నెట్వర్క్లో ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## దర్శకుడు, నటుడు భాగ్యరాజ్ మృతి

**మొదటి పేజీ తరువాయి**

'కింగ్ ఆఫ్ స్క్రీన్ ప్లే' అని పిలుస్తుంటారు . తెలుగులో అల్లరి నరేశ్ నటించిన పెళ్లైంది కానీ' సినిమాకు డైరెక్టర్ గా వ్యవహరించారు. ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, అబ్బాయి గారు సినిమాలకు స్క్రిప్ట్ అందించారు. తెలుగులో భాగ్యరాజ్ చివరి చిత్రం శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన కుబేర. మూడు రోజుల కిందట గోవాలో కుష్బూ కూతురి పెళ్లికి హాజరయిన భాగ్యరాజ్ హఠాన్మరణంతో తమిళ సినీ లోకం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైంది. ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించి ప్రేక్షకుల గుండెల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న భాగ్యరాజ్ చిత్ర పరిశ్రమకు తీరని లోటు. భాగ్యరాజ్ మరణవార్త తెలియగానే కోలీవుడ్తో పాటు సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీకి చెందిన పలువురు ప్రముఖులు, అభిమానులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు. భాగ్యరాజ్ కు శరణ్య భాగ్యరాజ్ (కుమార్తె), శంతను భాగ్యరాజ్( కుమారుడు) ఉన్నారు. పారిజాతం అనే సినిమాతో శరణ్య, సక్కరకట్టి అనే సినిమాతో శంతను సినీరంగంలో ప్రవేశించారు.

### సెంటిమెంట్ వ్యూహం ఫలిస్తుందా..? లేక

# రాజకీయ రిస్క్గా మారుతుందా?

### పవన్ కల్యాణ్ను టార్గెట్ చేస్తున్న కవిత వ్యూహంపై చర్చ




**దశ, హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు, వ్యూహాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ను లక్ష్యంగా చేసుకుని చేస్తున్న విమర్శలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వాన్ని అవమానించేలా పవన్ వ్యాఖ్యలు చేశారంటూ ఆమె తీవ్ర స్థాయిలో స్పందించడం, దేశద్రోహం కేసులు నమోదు చేయాలనే డిమాండ్ వరకు వెళ్లడం రాజకీయంగా చర్చకు కారణమైంది. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, కొత్తగా ఏర్పాటైన తెలంగాణ రక్షణ సేనకు ప్రజల్లో గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో కవిత తెలంగాణ సెంటిమెంట్ను మరోసారి ముందుకు తెస్తున్నట్లు కనిపిస్తోంది. హైదరాబాద్, ఢిల్లీలో పవన్ కల్యాణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలను తెలంగాణ ఆత్మగౌరవ అంశంగా ప్రస్తావిస్తూ ప్రజల్లో చర్చకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని చెబుతున్నారు. రాజకీయాల్లో ప్రజాదరణ కలిగిన నాయకులను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం ద్వారా తక్కువ సమయంలో ప్రచారం పొందాలనే వ్యూహాన్ని పలువురు నేతలు అనుసరిస్తుంటారు. కవిత కూడా అదే తరహా వ్యూహాన్ని అమలు చేస్తున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే ఆమె ప్రధాన రాజకీయ పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్తో ఉండాల్సిన సమయంలో పొరుగు రాష్ట్రానికి చెందిన జనసేన అధినేతను లక్ష్యంగా చేసుకోవడం ఎంతవరకు ప్రయోజనకరమనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు తెలంగాణలో జనసేన పార్టీ ప్రభావం ప్రస్తుతం పరిమితంగానే ఉందని రాజకీయ పరిశీలకులు గుర్తుచేస్తున్నారు. గత ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. ఇటీవల హైదరాబాద్లో పార్టీ కార్యాలయం ప్రారంభించినప్పటికీ రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తిగా ఇంకా ఎదగలేదనే అభిప్రాయం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పవన్ పై నిరంతరం విమర్శలు చేయడం వల్ల జనసేనకు అనవసర ప్రచారం లభించే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో ప్రజలు ప్రస్తుతం నిరుద్యోగం, రైతుల సమస్యలు, రుణమాఫీ, అభివృద్ధి, సంక్షేమం వంటి స్థానిక అంశాలపై ఎక్కువ దృష్టి సారిస్తున్నారని, ఈ నేపథ్యంలో ప్రాంతీయ సెంటిమెంట్ అంశం ఎంత మేర ప్రభావం చూపుతుందనేది చూడాల్సి ఉందని అంటున్నారు.

## జ్యువెలరీ షోరూమ్లో రౌడీషీటర్ వీరంగం

**మొదటి పేజీ తరువాయి**

డిమాండ్ చేశారని, "తర్వాత వచ్చినప్పుడు డబ్బులు సిద్ధంగా ఉంచాలని" హెచ్చరించినట్లు ఫిర్యాదులో తెలిపారు. డబ్బులు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, తనతో పాటు షోరూమ్ సిబ్బందికి ప్రాణహాని ఉందని మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులు అలీమ్, యూనస్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com